# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక

## 3వ అధ్యాయము

### క్రీస్తు మోషే కంటె శ్రేష్ఠుడు

ఇందువలన, పరలోక సంబంధమైన పిలుపులో పాలుపొందిన పరిశుద్ధ సహోదరులారా, మనము
ఒప్పుకొనినదానికి అపొస్తలుడును ప్రధాన యాజకుడునైన యేసుమీద లక్ష్యముంచుడి. 2 దేవుని యిల్లంతటిలో
మోషే నమ్మకముగా ఉండినట్టు, ఈయన కూడ తన్ను నియమించిన వానికి నమ్మకముగా ఉండెను. 3 ప్రతి
యిల్లును ఎవడైన ఒకనిచేత కట్టబడును సమస్తమును కట్టినవాడు దేవుడే. 4 ఇంటికంటె దానిని కట్టిన
వాడెక్కువ ఘనత పొందినట్టు, ఈయన మోషేకంటె ఎక్కువ మహిమకు అర్హుడుగా ఎంచబడెను. 5 ముందు
చెప్పబోవు సంగతులకు సాక్ష్యార్థముగా మోషే పరిచారకుడైయుండి దేవుని ఇల్లంతటిలో నమ్మకముగా ఉండెను.
6 అయితే క్రీస్తు కుమారుడైయుండి ఆయన యింటి మీద నమ్మకముగా ఉన్నాడు ధైర్యమును నిరీక్షణవలన
ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లు. 7 మరియు పరిశుద్ధాత్మ
ఇట్లు చెప్పుచున్నాడు– 8 నేడు మీరాయన శబ్దమును వినినయెడల, అరణ్యములో శోధన దినమందు కోపము
పుట్టించినప్పటివలె మీ హృదయములను కఠినపరచుకొనకుడి. 9 నలుబది సంవత్సరములు నా కార్యములను
చూచి మీ పితరులు నన్ను పరీక్షించి శోధించిరి. 10 కావున నేను ఆ తరము వారివలన విసిగి వీరెల్లప్పుడును
తమ హృదయాలోచనలలో తప్పి పోవుచున్నారు– నా మార్గములను తెలిసికొనలేదు, 11 గనుక నేను
కోపముతో ప్రమాణము చేసినట్టు వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరని చెప్పితిని. 12 సహోదరులారా,
జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్టహృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ
ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి.

### అంతము మట్టుకు ఉండవలసిన విశ్వాసము

13 నేడు మీరాయన శబ్దమును వినినయెడల, కోపము పుట్టించిన నప్పటివలె మీ హృదయములను
కఠినపరచుకొనకుడి అని ఆయన చెప్పెను గనుక, 14 పాపము వలన కలుగు భ్రమచేత మీలో ఎవడును
కఠిన పరచబడకుండునట్లు – నేడు అనబడు సమయముండగానే, ప్రతిదినమును ఒకనికొకడు బుద్ధి
చెప్పుకొనుడి. 15 ఏలయనగా మొదట నుండి మనకున్న దృఢవిశ్వాసము అంతము మట్టుకు గట్టిగా చేపట్టిన
యెడలనే క్రీస్తులో పాలివారమై యుందుము. 16 విని కోపము పుట్టించిన వారెవరు ? మోషేచేత
నడిపింపబడి ఐగుప్తులో నుండి బయలుదేరి వచ్చిన వారందరే గదా? 17 ఎవరిమీద నలుబది ఏండ్లు ఆయన
కోపగించెను ? పాపము చేసినవారి మీదనే గదా ? వారి శవములు అరణ్యములో రాలి పోయెను. 18 తన
విశ్రాంతిలో ప్రవేశింపరని ఎవరిని గూర్చి ప్రమాణము చేసెను ? అవిధేయులైన వారిని గూర్చియే గదా? 19
కాగా అవిశ్వాసము చేతనే వారు ప్రవేశింపలేక పోయిరని గ్రహించుచున్నాము.